నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 46 | బుధవారం, 15 జూలై 2026 | పేజీలు - | వెల : 3/-




# అభివృద్ధికి రాజకీయాలతో.. సంబంధం లేదు



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. , రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలు కీలక పాత్ర పోషిస్తున్నా యని తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటు పడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవు పలికారు.

### తెలంగాణ మాదిరే ఇతర రాష్ట్రాలు స్పందించాలి: కేంద్ర మంత్రి

విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయనితెలిపారు.దేశంలోఎక్కడాలేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్ర సృష్టించిందని ఆయన అభినందించారు. భూ సేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరే స్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్రమంత్రిరామ్మోహన్నాయుడుఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

# ఆషాఢం బోనాల జాతరకు సర్వం సిద్ధం



**వాస్తవ తెలంగాణ** ఆషాఢ మాసం బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. జులై 16న గోల్కొండ కోటలో ప్రారంభమై, ఆగస్టు 13 వరకు నగరం నలుమూలలా జరిగే ఈ ఉత్సవాల కోసం వివిధ ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్టు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.నగరంలోని పురాతన బస్తీలు, ప్రధాన కూడళ్లలోని దేవాలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. పాత జీహెచ్ఎంసీ పరిధిలోని 3,427 దేవాలయాలకుగాను రూ. 15,05,41,150 నిధులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో విడుదల చేసినట్టు మంత్రి పొన్నం పేర్కొన్నారు. సందర్శకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని లైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి వసతులపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**ఉత్సవాల ప్రధాన షెడ్యూల్..**

ఈనెల 16న గోల్కొండ శ్రీజగదాంబ మహంకాళి ఆలయంలో తొలి బోనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాలు (20న ఎదుర్కోలు, 21న కల్యాణం, 22న రథోత్సవం), ఆగస్టు 2, 3వ తేదీల్లో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు, రంగం కార్యక్రమం ఉంటుంది. ఆగస్టు 9న లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారితోపాటు నగరవ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో బోనాలు ఉంటాయి.

# ఉద్యమ ద్రోహే కాదు..జలద్రోహి కూడా



మెదక్ :**వాస్తవ తెలంగాణ** సుప్రీంకోర్టు సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం, రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం బట్టబయలైందని, అందుకే ప్రభుత్వం వేసిన సూట్ డిస్మిస్ అయ్యిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాజకీయ పదవీ కాంక్ష తప్ప రాష్ట్ర ప్రయోజనాలపై రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకోవడంపైనే రేవంత్ రెడ్డి దృష్టి పెట్టారన్నారు.అప్పుడైనా, ఇప్పుడైనా పూర్తి ఆధారాలతోనే మేం మాట్లాడుతున్నామని తెలిపారు. గోదావరి–బనకచర్ల విషయంలో ఏపీ ముందుకు వెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని ఆరోపించారు. సోమవారం సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందని, 'సూట్ కూడా సరిగా వేయలేకపోయారు" అని సుప్రీంకోర్టు చెప్పిందని, కావాలనే లోపభూయిష్టమైన సూట్ వేశారన్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన కేసులో లోపాలు ఎలా ఉంటాయి? లోపాలతో కూడిన సూట్ ఎందుకు దాఖలు చేశారు? అడ్వొకేట్ జనరల్, ప్రభుత్వ న్యాయవాదులు ఏమి చేస్తున్నారు? ముఖ్యమంత్రి ఆదేశం లేకుండా ఇంత బలహీనమైన సూట్ వేయడం సాధ్యమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను తిట్టడంపైనే దృష్టి ఉంది తప్ప తెలంగాణ నీటి ప్రయోజనాలపై లేదని, గతంలో వేసిన రిట్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని, రిట్ కొట్టివేయబడిన తర్వాత వేసిన సూట్ కూడా కొట్టివేయబడిందన్నారు. నాడు గోదావరి–నల్లమల సాగర్ టెండర్లు పూర్తయ్యాకే కోర్టుకు వెళ్లారని, 11 డిసెంబర్ 2025న టెండర్లు పూర్తయితే, ప్రభుత్వం16 డిసెంబర్ 2025న రిట్ వేసిందని, అందుకే రిట్ కొట్టివేయబడిందని వివరించారు. ఇప్పుడు సూట్ కూడా కొట్టివేయబడిందన్నారు. ఏడు నెలలుగా బలమైన సూట్ ఎందుకు వేయలేకపోయారు? సూట్ లోపభూయిష్టంగా ఉందని సుప్రీంకోర్టు అక్షింతలు వేసిందని, చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కు అయ్యారనడానికి ఇంతకంటే పెద్ద సాక్ష్యం అవసరం లేదన్నారు. రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు... తెలంగాణ జల ద్రోహి కూడా అని తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబుతో అంతర్గత ఒప్పందం చేసుకుని తెలంగాణ నీటి ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని, దేశంలోనే ఇంత లోపభూయిష్టమైన సూట్ మరొకటి ఉండదన్నారు. డిసెంబర్ 23న రేవంత్ రెడ్డి కమిటీ వేశారని, చంద్రబాబు సూచించిన ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమించారని, ఆదిత్యనాథ్ దాస్ తెలంగాణకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఇరిగేషన్ అధికారుల సమావేశాల వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో ముగ్గురు సీఎంల సమావేశంలో ఏం జరిగిందో వెల్లడించాలన్నారు. పాలమూరుకు ఎన్ఓసీ తెస్తానని తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని, పాలమూరుకు కేటాయించిన 90 టీఎంసీల నీళ్లు తెలంగాణ హక్కు.అని దానికి ఎన్ఓసీ అవసరం లేదన్నారు. రేవంత్‌కు అవగాహన తక్కువ... ఆవేశం ఎక్కువ అని దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో, నల్లమల ఎక్కడుందో కూడా ప్రభుత్వానికి తెలియదన్నారు. ఆదిత్యనాథ్ దాస్ మాటలు విని తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మానిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ శ్రీహరి, మామిండ్ల రాజేందర్, నరహరిరెడ్డి, పట్నం మానిక్యం, కాసాల బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న సినిమాలు, నిర్మాతలకు అండగా ఉంటా



- వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రీ రిలీజ్ వేడుకలో కవిత
- అధికారంలోకి వస్తే కొత్త సినీ పాలసీ తెస్తామని ప్రకటన
- 'మూడు రంగుల జెండా' పాటతో ఒకరు సీఎం అయ్యారంటూ ఆసక్తికర వ్యాఖ్య

**వాస్తవ తెలంగాణ** చిన్న సినిమా నిర్మాతలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో తమకు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం లభిస్తే వారికి మేలు చేసేలా కొత్త సినీ విధానాన్ని తీసుకొస్తామని కల్వకుంట్ల కవిత తెలిపారు. అదే సమయంలో ఇటీవలి ఎన్నికల్లో ఓ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినంతగా ప్రజాదరణ పొందిన పాటకు సంగీతం సమకూర్చిన చరణ్ అర్జున్‌పై తనకు కాస్త కోపం ఉందని సరదాగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించాయి. దినేశ్ కుమార్, దివిజ ప్రభాకర్ జంటగా నటించిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు చరణ్ అర్జున్‌ను కవిత ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన అద్భుతమైన సంగీతాన్ని అందిస్తారని కొనియాడుతూ.. "చరణ్ అర్జున్ స్వరపరిచిన 'మూడు రంగుల జెండా' పాట ఒక వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసింది. అంతటి శక్తిమంతమైన పాటను అందించినందుకు ఆయనపై నాకు కాస్త అలక, కోపం వున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సినిమా పాటలు కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రతి చిన్నారికీ ఆల్బెండజోల్ మాత్ర



**వాస్తవ తెలంగాణ** ప్రతి చిన్నారికీ ఆల్బెండజోల్ మాత్రం అందాలని, చిన్నారుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో ఒకటి నుంచి 19 ఏండ్ల వయస్సు గల ప్రతి చిన్నారినీ నులిపురుగుల నివారణ కార్యక్రమం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం–2026 సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి మంత్రి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 33 జిల్లాల్లో ఒకటి నుంచి 19 ఏండ్ల వయస్సు గల 96,81,855 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. నులిపురుగుల సమస్య చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యపై ప్రభావం చూపుతుందని చెప్పారు. నులిపురుగుల కారణంగా రక్తహీనత, పోషకాహార లోపం, కడుపునొప్పి, విరేచనాలు, శారీరక బలహీనత, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఏ చిన్నారీ మాత్ర తీసుకోకుండా మిగిలిపోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సహాయంతో నడిచే, ప్రయివేటు పాఠశాలలు, ప్రీ–స్కూల్స్, మదర్సాలు, జూనియర్ కళాశాలల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తున్నట్టు తెలిపారు. విద్యా వ్యవస్థకు వెలుపల ఉన్న ఒకటి నుంచి 19 ఏండ్ల వయస్సు గల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు అందిస్తామని చెప్పారు.

# మేడ్చల్ ఫ్లవర్ డెకరేషన్ లైటింగ్ అండ్ డిజె సౌండ్ సిస్టం అసోసియేషన్



**మేడ్చల్ వాస్తవ తెలంగాణ న్యూస్** మేడ్చల్,కిష్టాపూర్, పూడూర్, గుండ్ల పోచంపల్లి డివిజన్ మరియు పక్క గ్రామాలను కలుపుకొని 43 మంది సభ్యులతో కమిటీ వేసుకోవడం జరిగింది.కమిటీ రిజిస్ట్రేషన్ నంబర్ 1005/2025 ఈరోజు కమిటీ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షులు విష్ణుచారి,కమిటీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ముదిరాజ్ చేతుల మీదుగా సభ్యులకు ఐడి కార్డ్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు షేక్ ఇబ్రహీం,కౌడే మహేష్ కురుమ, అజ్మత్ ఖాన్, లింగం ముదిరాజ్,మణికంఠ గౌడ్ వంశీ, ఫెరోజ్,అంజాద్ ఖాన్, ఎండి జలాల్, హైమద్, మల్లేష్, విక్కీ అరుణ్, శ్రీకాంత్, అఖిల్, శ్రీకాంత్, మేదరి నరేష్, రవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో 55 శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తి

**జూలై 24లోగా వంద శాతం నమోదు పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** మెదక్ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు 55 శాతం నమోదు పూర్తైనట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం మెదక్ మున్సిపాలిటీ వార్డు నంబర్-11లో ఎస్ఐఆర్ ప్రక్రియను ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, వార్డు కౌన్సిలర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఎస్ఐఆర్ నమోదుకు ఈ నెల 24వ తేదీ చివరి గడువని గుర్తు చేశారు. జిల్లాలో సుమారు 4.55 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటికే 55 శాతం నమోదు పూర్తైందన్నారు. మిగిలిన ప్రక్రియను కూడా గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలను అందజేసి, వాటిని పూర్తిగా నింపేలా ప్రజలకు సహకరించాలని సూచించారు. అవసరమైన చోట రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ సిబ్బందితో పాటు ఆశా వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా వీడియోలు, సందేశాలు పంపించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని, శని, ఆదివారాల్లో అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక ఎస్ఐఆర్ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 24వ తేదీలోపు జిల్లాలో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ నవీన్, స్థానిక కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఆధార్ పార్టీ మంచిర్యాల జిల్లా సమావేశం




**వాస్తవ తెలంగాణ న్యూస్ మంచిర్యాల జిల్లా** తెలంగాణ రాష్ట్రంలో రాజకీయముగా కొత్త పార్టీ 2023లో పురుడు పోసుకోగా ఆధార్ పార్టీ పేరుతో డాక్టర్.ఈడ శేషగిరి రావు స్థాపించిన ఆధార్ పార్టీ. చపాతీ రోలర్ గుర్తుగా, ఎన్నికల సంఘం గుర్తును కేటాయించిందని, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతుండగా, ఆధార్ పార్టీ మంచిర్యాల జిల్లా సమావేశం నగరములోని నార్త్ ఇన్ హోటల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పార్టీ అధ్యక్షులు కార్యదర్శిలు కార్యకర్తలు మేధావులు హాజరయ్యారు. ఈ సమావేశం ఆధార్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నిండుగోరి మధు ఆధ్వర్యంలో నిర్వహించగా మా పార్టీ అభ్యర్థులుగా గత అసెంబ్లీ ఎన్నికలు 2023తెలంగాణ రాష్ట్రంలో 43 అసెంబ్లీ స్థానాలలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీలో నిలువగా 2024 పార్లమెంట్ ఎన్నికలకు 14 స్థానాలలో పోటీ చేశారని, రాష్ట్రంలోని ప్రజలు ఓటర్లు మా పార్టీని ఆదరిస్తున్నారని, మా ఏజెండా ముఖ్యంగా ఉచిత విద్య ఉచిత వైద్యం ఉచిత న్యాయం రైతే రాజు కావాలని రాష్ట్రంలో ని ప్రతి యువతకు ఉపాధి లేదా ఉద్యోగం కావాలి అని మా పార్టీ మహిళలకు 40 శాతం రిజర్వేషన్ కల్పిస్తుందని మా పార్టీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి ఉంటాడని బడుగు బలహీన వర్గాలకు సరియగురీతిలో అవకాశాలు ఉంటాయని, రాబోవు స్థానిక సంస్థల జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి మా అభ్యర్థులు పోటీలో నిలుస్తారని,మంచిర్యాల ఆధార్ పార్టీ జిల్లా సమావేశంలో తెలియజేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో పూర్తిగా మా పార్టీ అభ్యర్థులు 2028 పోటీలో ఉంటారని తెలియజేశారు. మహిళలు యువకులు మన ఆధార్ పార్టీని ఆదరించాలని పార్టీలో చేరాలని ఆయన కోరారు అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ అధ్యక్షులు సమావేశంలో కోరారు.

# నిజమైన తెలంగాణ ఉద్యమకారులకే ప్రాధాన్యత ఇవ్వండి

**ఈనెల 20న ఉద్యమకారుల ఫోరం అభ్యర్థన పత్రాల స్వీకరణశ్రీ డాక్టర్ చీమ శ్రీనివాస్**




**వాస్తవ తెలంగాణ న్యూస్,** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఫౌండర్, చైర్మన్ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమీక్ష సమావేశాలలో జరుగుతున్న లోపాలపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సాధించాలని, తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఫౌండర్, చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా డా: చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ... ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తరపున కృతజ్ఞతలు తెలిపారు. తమరు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్నప్పుడే మిమ్మల్ని కలిసి ఉద్యమకారుల సమస్యలను మీ దృష్టికి తీసుకురావడం జరిగిందని, మరి అదే విధంగా టీపీసీసీ అధ్యక్షులు అయిన తర్వాత కూడా మిమ్మల్ని కలిసి, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారుల అంశాన్ని చేర్చాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని, మీరు ఆ హామీని మేనిఫెస్టోలో పెట్టినందుకు మరోసారి ధన్యవాదాలు తెలిపారు. కానీ నేడు ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమీక్ష సమావేశాలలో జరుగుతున్న తీరు పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు.కమిటీలోని ప్రధాన లోపాలు పాత టీజేఏసీ నాయకులకు ప్రాధాన్యత, ఆనాడు అధికారంలో ఉన్న ప్రభుత్వంలో పదవులు అనుభవించి, ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిన పాత టి జేఏసీ నాయకులకు కమిటీ ప్రాధాన్యత ఇస్తోంది. టీజేఏసీ తో సంబంధం లేదన్న వారే, 2014 తర్వాత టి జేఏసీ తో మాకు సంబంధం లేదు అని మీడియా ముందు చెప్పి వెళ్లిపోయిన వారికి 90% ప్రాధాన్యత ఇస్తున్నారని మీడియా సాక్ష్యాలు ఉన్నాయి. రాజకీయ పార్టీ పెట్టినవారు ప్రస్తుతం ఉన్న కొంతమంది జేఏసీ నాయకులు 2018లో తెలంగాణ జన సమితి పార్టీ పెట్టారు. 12 సంవత్సరాలు మాట్లాడని వారు, గత ప్రభుత్వంలో పదవులు అనుభవించిన టి జేఏసీ నాయకులు గత 12 సంవత్సరాలలో ఒక్కరోజు కూడా ఉద్యమకారుల గురించి మాట్లాడలేదు. స్టీరింగ్ కమిటీ పేరుతో ఏర్పాటు చేసిన సమావేశాలలో పాల్గొన్న వారంతా కెసిఆర్ ప్రభుత్వంలో పదవులు పొందినవారే, వీరిలో ఒక్కరు కూడా ఉద్యమకారుల కోసం గొంతు ఎత్తలేదు. టిజేఏసీ సమీక్ష సమావేశాలు అనే పేరుతో మాకు సంబంధం లేదు అని చెప్పిన వారితోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉనికి లేని సంఘం ప్రస్తుతం ఉనికిలో లేని టీజేఏసీ పేరుతో ఎవరి స్వార్థం కోసం, ఎవరి ఉనికి కోసం సమావేశాలు పెడుతున్నారో అర్థం కావడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘాల ప్రమేయం లేకుండా, ప్రతి నిజమైన తెలంగాణ ఉద్యమకారుడి అభిప్రాయం తీసుకోవలసిన కమిటీ, తమ అనుచరులకు, భజనపరులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ స్వార్థ పూరితంగా వ్యవహరిస్తోందని చెప్పారు. జిల్లా సమీక్ష సమావేశం అంటే ఆ జిల్లాలో తెలంగాణ సాధన కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి ఆహ్వానం, అవకాశం ఉండాలి, కానీ కొంతమందిని మాత్రమే ఆహ్వానించి వ్యక్తిగత ఉనికి కోసం కుట్రలు చేస్తున్నారు. నేడు కమిటీ ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించింది తెలంగాణ ఉద్యమకారుల సంఘాలే, కానీ నామమాత్రంగా చివరిగా సమీక్ష సమావేశానికి ఆహ్వానిస్తున్నారు. కాబట్టి జరుగుతున్న తప్పిదాలపై విచారణ జరిపి, నిజమైన ఉద్యమకారులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

# జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్య - టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



**హైదరాబాద్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, వివిధ పత్రికలు, చానళ్ళల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదించుకోలేక పోతున్నారని అన్నారు. జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతునలను దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు సీట్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇవ్వాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.

**జర్నలిస్టుల పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక కోటా**

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించే విషయాన్ని పరిశీలిస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఏ రాష్ట్రంలోనైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను ఇస్తున్నట్లయితే దాని వివరాలు ఇవ్వాలని ఆమె ఫెడరేషన్ ప్రతినిధులను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా నడుస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా కింద సీట్లు ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచెం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్ తదితరులున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలు:-రవి రాజ్ రాథోడ్ విమర్శలు




**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్)** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం హైదరాబాద్: తెలంగాణ రైతుల జీవనాధారమైన కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేదికగా మార్చుకోవడం దురదృష్టకరమని జనసేన నాయకుడు రవి రాజ్ రాథోడ్ విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని పక్కనబెట్టి పరస్పర ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నారని ఆయన అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల మరమ్మతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రవి రాజ్ రాథోడ్ ఆరోపించారు. దెబ్బతిన్న బ్యారేజీల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ఎన్డీఎస్ఏ (చీణూూ) చేసిన సిఫార్సులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రాజెక్టు ఆలస్యంగా పునరుద్ధరించబడితే తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతుల ప్రయోజనాలపై రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రవి రాజ్ రాథోడ్ హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన విజిలెన్స్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విడుదల చేసి, వాస్తవాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలకు స్వస్తి చెప్పి, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణపై అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని రవి రాజ్ రాథోడ్ పిలుపునిచ్చారు.


# రూ.2.93 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

## 11 వార్డుల్లో సిసి రోడ్డు,డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శంకుస్థాపన



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధిలో భాగంగా రూ.2.93 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి.రోహిత్ రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 31, 30, 23, 22, 20, 16, 17, 18, 19, 21, 28 వార్డుల్లో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని అభివృద్ధి రూపంలో నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు.రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గతంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.మెదక్ పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని నిధులు తీసుకువస్తున్నామని తెలిపారు. హామీలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో కనిపించేలా నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు.అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా పనుల నాణ్యతను పర్యవేక్షించి తమ సూచనలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు,వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు,ఆవారి. రాజశేఖర్, అరుణ, శశాంక్,సంపత్ మన్సూర్ అహ్మద్, రాజమణి, గౌస్ అఖిల, శివరామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు యం.గంగాధర్, కో ఆప్షన్ సభ్యులు కోర్వి రాములు, తాహెర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజనం పరిశు భ్రంగారుచికరంగా ఉండాలిమండల విద్యాధికారి యన్ శంకర్





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణములోమధ్యాహ్న భోజన పథకం అమలులో పరిశుభ్రతనాణ్యత పాటించాలని సదాశివపేట మండల విద్యాధికారి యన్.శంకర్ వంట ఏజెన్సీ కార్మికులకు సూచించారు. మంగళవారం సదాశివపేట మండల వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ కార్మికులతో మండల విద్యాధికారి శంకర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వంట చేసే సమయంలో ప్రతి కార్మికుడు తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు, శరీరం ముందు భాగంలో యాప్రాన్, ముక్కుకు మాస్క్ తలకు చెఫ్ క్యాప్ ధరించాలని ఆదేశించారువంటగదితో పాటు దాని చుట్టుపక్కల ప్రాంతాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని, నిల్వ ఉన్న సరుకులు కూరగాయలు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరిశుభ్రత పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారానికి మూడు గుడ్లు వారానికి మూడుసార్లు రాగి జావా క్రమము తప్పకుండా పెట్టాలని సూచించారుఅదేవిధంగా వంట ఏజెన్సీ ట్రైనర్ సునీత మాట్లాడుతూ వంట ఏజెన్సీ సభ్యులకు ఆహార తయారీలో పాటించాల్సిన నియమ నిబంధనలువ్యక్తిగత పరిశుభ్రత వంటశాల నిర్వహణపై అవగాహన కల్పించారుభోజన నాణ్యతలో ఎలాంటి లోటు ఉండకూడదని తెలిపారుమధ్యాహ్న భోజనం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అందరూ సహకరించాలని మండల విద్యాధికారిశంకర్ కోరారు. సమావేశంలో మండల పరిధిలోని పలు పాఠశాలల వంట ఏజెన్సీ కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రమాదాలకు చెక్..

# వై జంక్షన్‌లో అండర్‌పాస్..

## రెండు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని ఎన్‌హెచ్‌ఏఐ హామీ.
## వై జంక్షన్ అండర్‌పాస్‌కు బీఆర్ఎస్ పోరాటమే ఫలితం.
## మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ ప్రతినిధి:-** రామాయంపేట పట్టణ ప్రవేశ ద్వారం వద్ద ఆద్య హోటల్ సమీపంలోని వై జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణానికి మార్గం సుగమం కావడం బీఆర్ఎస్ చేపట్టిన నిరంతర ఉద్యమాల ఫలితమేనని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ కార్యాలయంలో రీజినల్ ఆఫీసర్ శివశంకర్‌ను మంగళవారం కలిసి వై జంక్షన్ సమస్యపై వినతిపత్రం అందజేశారు అనంతరం ఈసందర్భంగా మాట్లాడుతూ..వై జంక్షన్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ సమస్యను పలుమార్లు ప్రభుత్వంతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు అండర్‌పాస్ నిర్మాణానికే ఏకగ్రీవంగా మద్దతు తెలిపారని చెప్పారు.ప్రమాదాల్లో కుటుంబ పెద్దలను కోల్పోయిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కోమటిపల్లి నుంచి కేసీఆర్ కాలనీ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వరకు సుమారు కిలోమీటరు మేర అండర్‌పాస్ నిర్మించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దీంతో కోమటిపల్లి, గొల్లిపర్తి, కేసీఆర్ కాలనీ ప్రజలతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ విద్యార్థులకు సురక్షిత రాకపోకలు కలుగుతాయని పేర్కొన్నారు.వై జంక్షన్‌ను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినప్పటికీ ఇంతకాలం అండర్‌పాస్ మంజూరు కాకపోవడం బాధాకరమని అన్నారు. అయితే టెండర్ ప్రక్రియ పూర్తైందని, మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ముందుండి పోరాటం కొనసాగిస్తుందని, ప్రజా ప్రయోజనాల కోసం ఉద్యమాలు ఆగవని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, కౌన్సిలర్లు చౌదరి చరిత, కొక్కు ప్రవీణ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు ఉమామహేశ్వర్, హస్నొద్దీన్, రొయ్యల నవీన్, దోమకొండ శ్రీనివాస్, రాచూరి శ్రీనివాస్, నీల రాజు, బాసం శీను, వంశీ, దాకి బునీత్, తాటిపల్లి రామ్‌కీ, శ్రీకాంత్ సాగర్, శ్రావణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కష్టకాలంలో అండగా ఉంటా.కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

## దుర్గమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. సర్పంచ్ మల్లేశంకు భరోసా..



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్: –** పాపన్నపేట మండలం నార్సింగి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దారబోయిన మల్లేశం తల్లి దారబోయిన దుర్గమ్మ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఫోన్‌లో మల్లేశంతో మాట్లాడి దుర్గమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు కష్టకాలంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైతే ఆర్థిక సహాయం కూడా అందిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం నారాయణ మల్లారెడ్డి ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి దుర్గమ్మకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. దుర్గమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, మల్లేశం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి అవసరం వచ్చినా తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

# జోగిపేట పట్టణంలో ట్రాన్స్ఫార్మర్ల రిపేరింగ్



**వాస్తవ తెలంగాణ పుల్కల్ ప్రతినిధి రవికుమార్** మండల పరిధిలోని బస్వాపూర్ శివార్లో ఉన్న ట్రాన్స్ఫార్మర్ గత రెండు రోజుల క్రితం కాలిపోయింది అట్టి ట్రాన్స్ఫార్మర్ మరమత్తుల కోసం ఆందోల్ నియోజకవర్గం లోని జోగిపేట పట్టణంలో ట్రాన్స్ఫార్మర్ల రిపేరింగ్ జరుగుతుంది అందులో భాగంగా పుల్కల్ మండలానికి చెందిన బస్వాపూర్ గ్రామ శివారులో సర్వే నెంబర్393 లో ఉన్న నాగిరెడ్డి ట్రాన్స్ఫార్మర్ కాలిపోయి గత నాలుగు రోజులు అవుతుం ది. అట్టి ట్రాన్స్ఫార్మర్ను పట్టించుకునే నాధుడే కలువయ్యాడు అట్టి ట్రాన్స్ఫారం దగ్గరికి ఎవరైతే పోతారో వారి మీద నిందలు మోవుతున్నారు అయినప్పటికీ ఇప్పటికైనా పై అధికారులు స్పందించి అట్టి మరమ్మత్తులను చేపట్టే విధంగా జిల్లా పాత్రికేయులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు

# నిందితులకు శిక్షపడితేనే బాధితులకు న్యాయం

## కోర్టు--పోలీసు సమన్వయం మరింత బలోపేతం కావాలి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ




**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు నిజమైన న్యాయం చేసిన వారమవుతామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కోర్టు--పోలీసు సమన్వయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ సాక్ష్యాల సేకరణ, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌తో పాటు కోర్టు--పోలీసు శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సూచనలు చేశారు. కోర్టు లైజనింగ్ అధికారి న్యాయవ్యవస్థకు, పోలీసు శాఖకు మధ్య వారధిగా పనిచేయాలని, సమన్లు, వారెంట్లు, ఇతర కోర్టు ప్రక్రియలను జాప్యం లేకుండా సంబంధిత అధికారులకు చేరవేయాలని సూచించారు. చార్జిషీట్లు, కేసు డైరీలు, ఇతర పత్రాలను సకాలంలో కోర్టుకు సమర్పించడం, సమన్లు, వారెంట్లను వెంటనే అమలు చేయడం ద్వారా కేసుల విచారణ వేగవంతమై నిందితులకు శిక్షలు పడే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.



శాస్త్రీయ దర్యాప్తు, పటిష్ఠమైన సాక్ష్యాలతోనే న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని అన్నారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ..బాధితులకు సత్వర న్యాయం అందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. పోలీసు--న్యాయవ్యవస్థ సమన్వయంతో ఈ ఏడాది జిల్లాలో 20 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యేలా చేశామని తెలిపారు. వాటిలో 12 కేసుల్లో జీవిత ఖైదు, ఐదు కేసుల్లో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, మరో మూడు కేసుల్లో ఏడేళ్లు లేదా అంతకంటే తక్కువ కారాగార శిక్షలు ఖరారైనట్లు వివరించారు.

ఈ విజయాలు నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ సాక్ష్యాల సేకరణ, ఫోరెన్సిక్ ఆధారాల వినియోగం, సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేయడం, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ ఫలితమేనని పేర్కొన్నారు. కోర్టు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే నేరస్థులకు శిక్షలు ఖరారై బాధితులకు పూర్తి న్యాయం అందుతుందని అన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసమావేశంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, సీఐలు, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ఓటర్ సర్వే కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి..




**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/**మేడ్చల్ జిల్లా కాప్ర మండలం మంగళవారం కాప్రా మండలం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఎస్.ఐ.ఆర్ (ాజూవఎఖుశ్రీ ×త్వఅంఅజవ =వజఱంఅశీఅ) ఓటర్ సర్వే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అందజేసిన దరఖాస్తు ఫార్ములను సేకరించడం, అలాగే కొత్తగా అవసరమైన ఓటరు నమోదు ఫార్ములను పంపిణీ చేయడం జరిగింది.

**కార్యక్రమంలో పాల్గొన్న బి ఎల్ ఓ లు:**

-- బూత్ No. 82 -- బి ఎల్ ఓ సత్యనారాయణ -- బూత్ No.. 83 --బి ఎల్ ఓ నరేష్ -- బూత్ No.. 84 -- బి ఎల్ ఓ శంకర్ --బూత్ No. 85 -- బి ఎల్ ఓ నవ్య -- బూత్ No.86 -- బి ఎల్ ఓ స్వరూప --బూత్ No.. 87 -- బి ఎల్ ఓ శ్రీనివాస్ -- బూత్ No.. 88 --బి ఎల్ ఓ నవిత -- బూత్ No. 89 --బి ఎల్ ఓ రేణుక --బూత్ 90 --బి ఎల్ ఓ సదానంద్ ఈ కార్యక్రమంలో కుషాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కౌకుట్ల ప్రకాష్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ యాదవ్, నీరజ్ రెడ్డి, రామారెడ్డి, ఉదయ్ చారి, వంశీ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఎన్నికల జాబితాలో సక్రమంగా నమోదు కావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రజాసేవా దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తోంది అని కౌకుట్ల ప్రకాష్ రెడ్డి కుషాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలిపారు.

# ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

## ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తే లక్ష్యం: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.






**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** ప్రతి కేసులో వేగవంతంగా, నాణ్యమైన దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి నిందితులకు శిక్షపడేలా దర్యాప్తు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీసు అధికారిని నియమించి రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆర్థిక నేరాల నివారణలో భాగంగా వాహన తనిఖీలు, నాకాబందీని సమర్థవంతంగా నిర్వహించాలని, బ్లూ కోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ సిబ్బంది పాపిలాన్ పరికరాలతో అనుమానితుల వివరాలను సేకరించాలని సూచించారు. గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, దుకాణాలు, ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు తదితర కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్‌హెచ్‌వోలకు ఆదేశించారు. ఈసమావేశంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, సుభాష్ చంద్రబోస్, సీఐలు రేణుక, రాజశేఖర్ రెడ్డి, వెంకటరాజా గౌడ్, మహేష్, జార్జ్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య చేపట్టినటువంటి సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న

## తెలంగాణ రాష్ట్ర బీసీఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి బాష





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా పాల్గొన్న బండారు దత్తాత్రేయ పెద్దలు, మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రొఫెసర్స్ మరి ఈరోజు ముఖ్య ఉద్దేశం ఈ కార్యక్రమం లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పరిష్కారం కొరకై మరియు పెండింగ్లో ఉన్న 8500 కోట్లు,ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని, మరియు విద్యార్థులు అనేక రకలుగా ఇబ్బందులు పడుతున్నటువంటి సమస్యల పట్ల పరిష్కారం కొరకై చేపట్టినటువంటి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది మరి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు దేవరపల్లి వినోద్ కుమార్, సన్నీ,మహేష్అనిల్ మరియు విద్యార్థి సంఘం నాయకులుమరియువిద్యార్థులుఈ కార్యక్రమంలోపాల్గొనడం జరిగింది

# సీఎం సహాయనిధితో పేద కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక చేయూత

-జగద్గిరి నగర్‌కు చెందిన మహిళ చికిత్స కోసం మంజూరు
-సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో అందిన సహాయం
-పేదల ఆరోగ్య అవసరాలకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగిస్తున్న సీపీఐ
-రెండేళ్లలో కుత్బుల్లాపూర్‌లో పలువురికి లబ్ధి చేకూరిందన్న ఉమామహేష్
-ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఐ సేవలు కొనసాగుతాయని వెల్లడి



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** పేద ప్రజలకు వైద్య చికిత్స భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో ఉపయోగపడుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లోని జగద్గిరి నగర్‌కు చెందిన కావలి బాబు సతీమణి తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సహాయం సీపీఐ ఎమ్మెల్యే, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు చొరవతో అందిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సహకరించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, సీపీఐ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ, పేద ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని చెప్పారు. గత రెండేళ్లుగా జగద్గిరిగుట్ట డివిజన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అనేక మంది నిరుపేదలకు సీఎం సహాయనిధి ద్వారా వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం అందేలా కృషి చేశామని తెలిపారు. ఈ సహాయం ద్వారా లబ్ధి పొందిన ప్రజలు పార్టీపై విశ్వాసం వ్యక్తం చేస్తుండటం సంతోషకరమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ప్రధాన ధ్యేయమని, ప్రజలు కూడా పార్టీ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మద్దతు తెలుపుతూ సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం కార్యదర్శి వెంకటేష్, శాఖ నాయకులు చంద్రయ్య, కరుణాకర్, బాలకృష్ణ, చంద్రమ్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల కోసం జూలై 18న భారీ గర్జన

కనీస వేతనాల అమలే లక్ష్యంగా సీఐటీయూ బహిరంగ సభకు పిలుపు
-జీవో నెం. 06 ప్రకారం కనీస వేతనాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్
-ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
-శాస్త్రీయ విధానం లేకుండా కనీస వేతనాల జీవో విడుదలైందని విమర్శ
-వి.డి.ఏ పాయింట్ రేటు నిర్ణయంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన
-ప్రగతి నగర్‌లో సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ సమావేశం
-భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి జె. చంద్రశేఖర్ పిలుపు



**బాచుపల్లి, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కార్మికుల కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కుల సాధన కోసం ఈ నెల జూలై 18న నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవన్లో నిర్వహించిన సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 06 ప్రకారం కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధమైన సంక్షేమ సౌకర్యాలు కల్పించడంతో పాటు, యాజమాన్యాలు కార్మికులపై కొనసాగిస్తున్న వేధింపులను వెంటనే అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని ట్రేడ్ యూనియన్లు కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ ప్రమాణాలను పక్కనపెట్టి అతి తక్కువ వేతనాలతో జీవో విడుదల చేసిందని చంద్రశేఖర్ విమర్శించారు. అలాగే వి.డి.ఏ (వేరియబుల్ డియర్నెస్ అలవెన్స్) లెక్కింపులో మార్చి--2001 సిరీస్‌ను ఆధారంగా తీసుకుని పాయింట్ రేటును తక్కువగా నిర్ణయించడం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే కనీస వేతనాలను శాస్త్రీయ విధానంలో సవరించి, కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జూలై 18న జరిగే భారీ బహిరంగ సభలో పారిశ్రామిక కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు బి. వెంకట రామయ్య, బాచుపల్లి మండల కమిటీ సభ్యులు నాగభూషణ్, పెంటయ్య, ఎల్లమ్మ, స్వామి, భాస్కర్, వెంకట్ స్వామి, నాగరాజు, ఏడుకొండలు, డేవిడ్, పవన్, సతీష్, శ్రీను, మదిలేటి, చెన్నయ్య, మనీ, బుజ్జమ్మ, నాగశేషు, తిరుపతయ్య, అంజి, లక్ష్మీతో పాటు పలువురు కార్మికులు, ట్రేడ్ యూనియన్‌నాయకులు పాల్గొన్నారు.

# మాటల్లో కాదు... నిధులు తో అభివ్రుద్ధి లో కనిపిస్తున్న మల్లాపూర్.. : నెమలి అనిల్ కుమార్

--ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి పాలాభిషేకం లో మల్లాపూర్ నాయకులు.



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల అభివృద్ధి పనుల కోసం రూ.2 కోట్ల 7 లక్షల నిధులు మంజూరైన సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజల తరపున ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి, అలాగే ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వరుసగా నిధులు మంజూరు చేస్తుండటం ఆనందదాయకమని, ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా మల్లాపూర్ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం ఇదే విధంగా కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు జెమిలా బేగం, డి సి సి కార్యదర్శిలు దంతూరి రాజు గౌడ్,కోయగూర బాలరాజ్ గౌడ్ ,చౌదరిపల్లి పర్వతాలు,కాంగ్రెస్ సినియర్ నాయకులు కప్పర సాయి కిరణ్ గౌడ్, పి జి సుదర్శన్,మక్తల బాలరాజ్ గౌడ్,మెరుపుల బాలరాజ్,బెల్లం శ్రీను, జాని పాషా,జాని వేణు,కోయలకొండ రాజేష్, పంజాల శ్రీనివాస్,సురేష్ గౌడ్,టిల్లు ముదిరాజ్,నిక్కి,షేక్ అన్వర్, ఎం డి అన్వర్ ,అక్బర్,మహిళా నాయకురాలు శైలజ,ఇంతియాజ్, సోనీ,లావణ్య ,సునీత,ఇష్రాత్ భాను,అశు ,డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకులు గడ్డం వినేష్ యాదవ్,మైథిల్,విజయ్ గౌడ్, కాలనీ నాయకులు ,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# దమ్మాయిగూడ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం లో ముప్ప రామారావు..



**కీసర సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ లో ఖ+ణ ప్రారంభోత్సవ కార్యక్రమం -- ఖుషీ గార్డెన్, 7వ వార్డులి 7వ వార్డులోని ఖుషీ గార్డెన్‌లో మంగళవారం ఖ+ణ (భూగర్భ డ్రైనేజీ) ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముప్పా రామారావు, మాడిరెడ్డి నరేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జూపల్లి శోభా రాణి, కార్తీక్ గౌడ్, నర్సింహ రెడ్డి, సుమేష్, గోవింద్ సింగ్, దిలీప్ కుమార్, సమ్మి రెడ్డి, ప్రసాద్ గౌడ్, శ్రవణ్ రెడ్డి, రాజేష్, పండాల యాదగిరి గౌడ్, కుందన్‌పల్లి వెంకటేష్, ముప్పా శ్రీలత, మనోజ్ రెడ్డి, భాస్కర్ గౌడ్, ప్రశాంత్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు. లిఖుషీ గార్డెన్ నివాసితులకు మెరుగైన భూగర్భ డ్రైనేజీ మౌలిక సదుపాయాలు మరియు పారిశుధ్య సౌకర్యాలను కల్పించే లక్ష్యంతో, సుమారు ?11.70 లక్షల వ్యయంతో 260 మీటర్ల పొడవు మరియు 1 అడుగు వెడల్పు గల డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయి అని ముప్పు రామారావు తెలిపారు.

# కంబాలపల్లి గ్రామం సర్పంచ్ భారతమ్మ బాబు గారి ఆధ్వర్యంలోని జలయజ్ఞం






**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాసదాశివపేట మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ భారతమ్మ బాబు గారి ఆధ్వర్యంలో జలయజ్ఞం కార్యక్రమం చేయడం జరిగింది గ్రామంలో ప్రతి ఒక్కరూ నీటిని ఆదా చేయాలనే  ఆలోచనతో ఈ కార్యక్రమంపై మిషన్ భగీరథ ఏఈ మరియు చిరంజీవి గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వరూప మరియ వార్డ్ మెంబర్లు కుమ్మరి ఆంజనేయులు బెలూరి ప్రభాకర్ రెడ్డి సయ్యద్ ఆఫ్రీన్ బేగం మునీర్ మరియు వాటర్ టెస్టింక్ ల్యాబ్ టెక్నీషియన్ మరియు గ్రామ పెద్దలు యువకులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది గ్రామంలో ప్రతి ఒక్కరూ నీటిని వృధా చేయకూడదు అని నీరు ఎంతో ప్రవిత్రమైందని నీరు లేనిది భూమి మీద జీవరాసులు ఏ జీవి కూడా బతకదని స్వచ్ఛమైన నీరును వినియోగించాలని గ్రామ సర్పంచ్ భారతమ్మ బాబు తెలపడం జరిగింది.

# ప్రతిభ గల పోలీస్ అధికారుల కు అవార్డులు అందించినా ఐపిఎస్, డి సి పి అధికారులు..







**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం కుషాయిగూడ పోలీస్ స్టేషన్లో లోక్ అదాలత్ లో భాగంగా మెరుగైన ప్రతిభ  కనబరిచిన పోలీసు అధికారులకు కే. సురేష్ కుమార్, ఐపీఎస్ , డిసిపి ఉప్పల్  చేతులమీదుగా అవార్డులు అందజేయడం  జరిగింది. అవార్డు గ్రహీతలు కె. నర్సింగరావు, ఏఎస్ఐ, డి సంతోష్ రెడ్డి, పిసి 4970, డి అశోక్, పిసి 10271. మరియు 14 బైకులు రికవరీ చేసిన కేసులో  జి వెంకటేశ్వర్లు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సార్ కి, ఎం విజయ్ ఎస్సై సార్ కి మరియు సిబ్బంది హెచ్ సి 532, పి యాదగిరి,  పిసి5640, ఎస్ శ్రీనివాస్,  పిసి 9608 కే. దినేష్ , పిసి 9665 సిహెచ్. మహేష్,  (ఙజూఎ )10864 సౌమ్య కు డిసిపి ఉప్పల్ కె సురేష్ కుమార్, ఐపీఎస్ చేతులమీదుగా అవార్డు అందుకోవడం జరిగింది.

# ఓటరు జాబితా సవరణలో వేగం పెంచండి

రాజకీయ పార్టీలతో ఏఈఆర్వో సమీక్ష సమావేశం
-ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్ల సహకారం కీలకమని సూచన
-దరఖాస్తుల గడువు ముగియనున్న నేపథ్యంలో పత్రాల సమర్పణ వేగవంతం చేయాలని పిలుపు
-ఆన్‌లైన్ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణపై రాజకీయ పార్టీలకు అవగాహన
-కంప్యూటరైజేషన్ ప్రక్రియపై తలెత్తిన సందేహాలకు ఏఈఆర్వో వివరణ
-ప్రజలకు ఇబ్బందులు లేకుండా సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారుల సూచన
-గాజులరామారం సర్కిల్-57లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ¢ Ü“ ~ó<Sº Z eÚ..** కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్-57, కుత్బుల్లాపూర్ జోన్‌లో మంగళవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఆర్వో యు. వెంకటరాములు మాట్లాడుతూ, దరఖాస్తుల సమర్పణకు గడువు సమీపిస్తున్నందున అర్హులైన ప్రతి ఓటరు తమ అవసరమైన పత్రాలను త్వరితగతిన సమర్పించేలా బూత్ లెవల్ ఏజెంట్లు (దీూాలు) చురుకుగా పనిచేయాలని కోరారు. ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, దరఖాస్తుల ప్రక్రియను సులభతరం చేయడంలో రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ విధానం, వాటి ప్రాముఖ్యతపై సమావేశంలో వివరించారు. ఇప్పటికే సమర్పించిన దరఖాస్తుల కంప్యూటరైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు తలెత్తిన సందేహాలను అధికారులు నివృత్తి చేసి, ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సకాలంలో పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో గాజులరామారం సర్కిల్-57 డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్వో యు. వెంకటరాములు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# శంభీపూర్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కేంద్రం పరిశీలన..

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి: కొలను హన్మంత్ రెడ్డి
-బూత్ స్థాయి అధికారులు పారదర్శకంగా ఓటరు నమోదు చేపట్టాలని సూచన
-పద్దెనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఓటరుగా నమోదు కావాలని పిలుపు
-గణన ఫారాలను సక్రమంగా నింపి సమర్పించాలని ప్రజలకు విజ్ఞప్తి
-గ్రామ చెరువు ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
-తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు బోర్‌వెల్లు మంజూరు చేస్తామని హామీ
-ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా

**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు.....** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రెండువందల తొంభై ఆరవ డివిజన్ దుండిగల్ పరిధిలోని శంభీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఓటరు నమోదు ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయాలని, పద్దెనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత కొత్త ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు గణన ఫారాలను పూర్తిగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించాలని కోరారు. అనంతరం గ్రామస్థులు తాగునీటి సమస్యతో పాటు గ్రామ చెరువు ఆక్రమణల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువుపై జరిగిన ఆక్రమణలను తొలగించి చెరువును పరిరక్షించేలా సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెండు బోర్‌వెల్లు మంజూరు చేస్తామని కొలను హన్మంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, దుండిగల్ డివిజన్ అధ్యక్షుడు జక్కుల మల్లేష్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, పీసరి మహేందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, సంగొళ్ల నాగేష్, క్యాసారం సత్తయ్య, సంగొళ్ల శంకర్, మనోహర్, గురువా రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# (మీవీజు ) ఎం ఎస్ ఎం ఈ రంగానికి కేంద్రం పెద్దపీట.. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేను కలిసిన ఏనుగు సుదర్శన్ రెడ్డి

**-MSME రంగం విస్తరణ, స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలు, యువత ఉపాధిపై చర్చ**

**-ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మీవీజు రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక: ఏనుగు సుదర్శన్ రెడ్డి**

**-RAMP పథకం, మహిళా హ్యాకథాన్, ఆవిష్కర్తలతో ముఖాముఖి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.**




ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్/ మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ హైదరాబాద్‌లోని జాతీయ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల సంస్థ (అఆ-ఎంఎవ)లో నిర్వహించిన లి కార్యక్రమంలో భారత ప్రభుత్వ సూక్ష్మ,చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు (మీవీజు), కార్మిక ఉ ఉపాధి శాఖ సహాయ కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా (మీవీజు) రంగ అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, స్టార్టప్‌ల ప్రోత్సాహం, మహిళా పారిశ్రామికవేత్తలకు అవకాశాల విస్తరణ, యువతకు స్వయం ఉపాధి కల్పన వంటి కీలక అంశాలపై కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే తో సార్థకంగా చర్చించారు.ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం( మీవీజు )ఎం ఎస్ ఎం ఈ రంగాన్ని దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా తీర్చిదిద్దే దిశగా అనేక సంస్కరణలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు యువత, మహిళలు, స్వయం ఉపాధి కోరుకునే ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మరింత మంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు.వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా అమలవుతున్న పథకం, స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమాలు, సాంకేతికత, మార్కెటింగ్, ఫైనాన్స్, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక అవకాశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే మహిళా హ్యాకథాన్ విజేతల సత్కారం, పుస్తకావిష్కరణ, ఆవిష్కర్తలతో ముఖాముఖి సమావేశం వంటి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ని మరోసారి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఏనుగు సుదర్శన్ రెడ్డి, భారతదేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకైన (మీవీజు )రంగం మరింత బలోపేతం కావాలని, యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.



# పొలాల్లో..రక్తపుధార!

**సూర్యాపేట జిల్లాలో రైతుల వినూత్న నిరసన**

- మా రక్తం ఇస్తాం.. ఎలా పండించాలో చూపించండి
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై అన్నదాతల ఆగ్రహం
- రైతులకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్

వాస్తవ తెలంగాణ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సూర్యాపేట జిల్లాలో రైతులు వినూత్న నిరసన చేపట్టారు. నీళ్లు లేకుండా రక్తంతో పంటలు పండించవచ్చని సీఎం అన్నారంటూ ఆరోపిస్తూ తమ రక్తాన్నే పొలాల్లో చల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా చివ్వేంల మండలం సేవాలాల్ తండా గ్రామపంచాయతీ, పంది బండ తండాలో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ గుగులోతు కవిత అనిల్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. రైతులు గుమిగూడి తమ రక్త నమూనాలను తీసి పంట పొలాల్లో చల్లారు. ఈ సందర్భంగా రైతు గుగులోతు లాలు మాట్లాడుతూ నీళ్లు లేకుండా రక్తంతో పంటలు పండించవచ్చని ముఖ్యమంత్రి చెప్పడం చాలా బాధాకరమన్నారు. రైతుల కష్టాలు అర్థం చేసుకోకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా తమ రక్తాన్ని సీఎంకు ఇస్తామని, పంటలు ఎలా పండించాలో ఆయనే వచ్చి రైతులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రైతుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుగులోతు వెంకన్న, గుగులోతు మాన్సింగ్, బోడియా, మహిళా రైతులు వీరమ్మ, బుజ్జి, మస్తు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదు.. డిజిటలైజేషన్‌ను పూర్తి చేయాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్



నాగర్ కర్నూల్ జిల్లా వాస్తవ తెలంగాణ

ఓటర్ల నమోదు డిజిటలైజేషన్ ప్రక్రియను గడులోగా పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, తనిఖీ చేశారు. పొరపాట్లకు తావులేకుండా డిజిటల్ విధానంలో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం ఉదయం నాగర్‌కర్నూల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న 112వ, 113వ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, అక్కడ కొనసాగుతున్న ఓటర్ల నమోదు డిజిటలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడతూ నాగర్‌కర్నూల్ పట్టణ పరిధిలో మొత్తం 31 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటి పరిధిలో 35,536 మంది నమోదిత ఓటర్లు ఉన్నారని మంగళవారం ఉదయం 8 గంటల వరకు 14,867 మంది ఓటర్ల వివరాలు మాత్రమే డిజిటలైజేషన్ ప్రక్రియలో నమోదు అయినట్లు ఆన్‌లైన్‌లో వెల్లడయ్యాయినీ కలెక్టర్ తెలిపారు. మిగిలిన ఓటర్ల వివరాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేసి, ఈ నెల 24వ తేదీలోపు పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్ కర్నూల్ రెవెన్యూ డివిజనల్ అధికారిని అర్చన, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, డీ.టీ కిరణ్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాడు అరెస్ట్



వాస్తవ తెలంగాణ

సైబర్ క్రైం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. రవి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీరంగూడకు చెందిన పల్లె సాయికిరణ్ "లక్ష్మీ డెయిరీ ఫార్మ్" పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ, గేదెలు, బర్రెలు అమ్మకానికి ఉన్నట్లు వీడియోలు అప్లోడ్ చేసేవాడు. వీడియోలలో చూపించిన ఫోన్ నంబర్‌కు సంప్రదించిన అమాయక ప్రజలను నమ్మించి, ముందుగా అడ్వాన్స్ చెల్లించాలని చెప్పి వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో మర్కూక్ గ్రామానికి చెందిన సాయిరెడ్డి శంకర్ రెడ్డి యూట్యూబ్‌లో వీడియోలు చూసి నిందితుడిని సంప్రదించి 10 బర్రెలు కావాలని కోరగా,వాటిధరరూ.15లక్షలుఅనిచెప్పిసుమారురూ.2,50,000 అడ్వాన్స్‌గా ఆన్‌లైన్ ద్వారా తసుకున్నాడు. అనంతరం బర్రెలను ఎప్పుడు పంపిస్తారని బాధితుడు పలుమార్లు సంప్రదించినప్పటికీ నిందితుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడంతో తాను మోసపోయినట్లు సాయిరెడ్డి శంకర్ రెడ్డి గ్రహించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మార్కూక్ పోలీస్ స్టేషన్ సైబర్ క్రైం కేసు నమోదు చేశారు. గజ్వేల్ రూరల్ సీఐ డి. రవి రాజు ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి మంగళవారం గజ్వేల్ న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో నిందితుడు ఇదే తరహాలో మరికొందరిని కూడా లక్షలురకు మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది.

# కబ్జా కోరల్లో.. రైల్వే భూమి!

## దేశ వ్యాప్తంగా 1068 హెక్టార్లు ఆక్రమణ

- సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి..
- ఐదేళ్లలో 32 శాతం మేర పెరిగిన భూ ఆక్రమణలు
- ఆక్రమణల తొలగింపులో తీవ్ర జాప్యం..
- కబ్జాలపై దీర్ఘకాలిక డేటా లేదని అంగీకరించిన రైల్వే బోర్డు

భారతీయ రైల్వే భారీ భూకబ్జా సమస్యతో సతమతమవుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు 1,068.54 హెక్టార్ల విలువైన రైల్వే భూమి ఆక్రమణకు గురైనట్లు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వెల్లడైంది. 2025 మార్చి నాటి గణాంకాల ప్రకారం ఈ విషయం తెలిసింది. ఆర్టీఐ దరఖాస్తుకు రైల్వే బోర్డు ఇచ్చిన సమాధానం ప్రకారం గడిచిన ఐదేళ్లలో కబ్జాలు గణనీయంగా పెరిగాయి. 202021లో 810.31 హెక్టార్లుగా ఉన్న కబ్జా భూమి, 202425 నాటికి 1,068.54హెక్టార్లకు చేరింది. అంటే.. ఈ ఐదేళ్లకాలంలోనే ఆక్రమణలు దాదాపు 32 శాతం పెరిగాయి. ముఖ్యంగా 202324లో ఒక్క ఏడాదిలోనే దాదాపు 268హెక్టార్ల భూమి అదనంగా కబ్జాకు గురైంది. 2026 మార్చి 27న ప్రభుత్వం పార్లమెంటులో ఇచ్చిన సమాధానం కూడా ఈ గణాంకాలకు దగ్గరగా ఉంది.






### ఆక్రమణల వేగం.. తొలగింపులు నెమ్మదిగా..

ఒకవైపు ఆక్రమణలు వేగంగా పెరుగుతుంటే, మరోవైపు వాటిని తొలగించే ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతోంది. గత ఐదేళ్లలో కేవలం 98.02 హెక్టార్ల భూమిని మాత్రమే రైల్వే శాఖ తిరిగి స్వాధీనం చేసుకోగలిగింది. కానీ, ప్రస్తుతం కబ్జాలో ఉన్న భూమి 1,068 హెక్టార్లకు పైగా ఉండటం గమనార్హం. ఇలా స్వాధీనం చేసుకున్న భూములను మల్టీట్రాకింగ్ పనులు, వర్క్‌షాప్‌లు, ప్యాసింజర్, ఫ్రైట్ టెర్మినల్స్ వంటి రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం ఉపయోగిస్తున్నట్లు ప్రభుత్వం లోక్‌సభలో తెలిపింది. తక్షణ అవసరం లేని భూములను వాణిజ్య అభివృద్ధి కోసం రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌ఎల్‌డీఏ)కి బదిలీ చేస్తారు.

### సమాచార లోపం.. కొరవడిన పర్యవేక్షణ

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన విషయం ఏమిటంటే.. రైల్వే బోర్డు వద్ద ఆక్రమణలకు సంబంధించిన పూర్తిస్థాయి, దీర్ఘకాలిక సమాచారం లేకపోవడం. 25 ఏళ్ల కబ్జాల వివరాలు కోరగా, తమ వద్ద కేవలం ఐదేళ్ల డేటా మాత్రమే ఉంటుందని బోర్డు బదులిచ్చింది. అంటే.. దశాబ్దాలుగా రైల్వే భూముల కబ్జా పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు కేంద్ర స్థాయిలో ఎలాంటి రికార్డులు లేవు. అంతేకాకుండా ఏయే రాష్ట్రాల్లో ఎంత భూమి కబ్జాలో ఉందనే వివరాలు కూడా తమ కార్యాలయంలో నిర్వహించడం లేదని, ఆ సమాచారం కోసం ఆయా జోనల్ రైల్వే కార్యాలయాలను సంప్రదించాలని బోర్డు సూచించింది. ఇది రైల్వే ఆస్తుల పర్యవేక్షణలో ఉన్న తీవ్రమైన లోపాలను ఎత్తిచూపుతోంది. మొత్తం మీద విలువైన ప్రభుత్వ ఆస్తులు చేజారుతున్నా, వాటిని కాపాడటంలో, కనీసం వాటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని నమోదు చేయడంలో కూడా రైల్వే శాఖ విఫలమవుతోందని స్పష్టమవుతోంది.